జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 29 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 6

## కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి నచ్చిన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- బాలికల రక్షణ, విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిల వాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 29 ,(ప్రజా జ్యోతి )** రాఖి పండుగను పురస్కరించుకొని కొత్తగూడెం కలెక్టరేట్‌లో రక్షాబంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు జిల్లా కలెక్టర్ తో పాటు ,అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా సంక్షేమాధికారి కి ,ఇతర అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్

మిగతా 6 లో...

- గతంలో ఐఎన్టియుసి నేత జనక్ ప్రసాద్ 'కుర్చీ' వివాదం..
- నేడు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ 'క్యాంప్' హుకుం!
- సింగరేణి అధికారిక వేదికలపై రాజకీయ అనుబంధ సంఘాల పెత్తనం!
- సిఎండి సీట్లోనే కూర్చుని సమీక్షలు నడిపిన ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్!
- కలెక్టరేట్, సచివాలయం పక్కనబెట్టి సొంత క్యాంప్ ఆఫీస్‌లోనే సమీక్షల నాటకం!
- మైన్స్ యాక్ట్, చట్టబద్ధ ప్రొటోకాల్‌ను బజారున పడేసిన డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ, జీఎం లలిత్ కుమార్!
- సింగరేణి వ్యాప్తంగా నిరసన జ్వాలలు.. లొంగిపోయిన అధికారులపై తక్షణ చర్యలకు డిమాండ్!




### రాజకీయ పరిహాసానికి...

2 లో..

# సింగరేణి సరెండర్

రాష్ట్రానికి వెలుగులు పంచే దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పట్ల రాజకీయ వ్యవస్థ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర పరిహాసానికి దారితీస్తోంది. ప్రజాస్వామ్య సరిహద్దులను దాటి అధికార పార్టీ నాయకులు ప్రదర్శిస్తున్న ఆధిపత్యం, దానికి ఉన్నతాధికారులు మోకరిల్లుతున్న వైఖరి పాలనాపరమైన దిగజారుడుతనానికి పరాకాష్టగా నిలుస్తోంది. గతంలో కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నేరుగా హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ సమీక్ష మందిరంలో కంపెనీ సిఎండి కూర్చునే అధికారిక కుర్చీలోనే ఆసీనులై ఏకంగా యూనియన్ సమావేశాన్ని నిర్వహించడం అప్పట్లో పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే.

● భద్రాద్రి కొత్తగూడెం / సింగరేణి ప్రతినిధి, ప్రజాజ్యోతి

## మీడియా ప్రతినిధులమంటూ ట్రాక్టర్ డ్రైవర్‌పై బెదిరింపు




- రామచంద్రాపురం ఎక్స్ రోడ్డు సమీపంలో ఘటన

**అశ్వరావుపేట ప్రజా జ్యోతి ఆగస్టు 28** రైతును బెదిరించి డబ్బులు దోచుకునేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాము మీడియా ప్రతినిధులమని చెప్పి ట్రాక్టర్ డ్రైవర్‌ను బెదిరించి రూ.5 వేల నగదు లాక్కున్న ఘటన రామచంద్రాపురం ఎక్స్ రోడ్డు సమీపంలో చోటుచేసుకుంది.

**పొగాకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను అడ్డగించి...**

ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున రామచంద్రాపురం

మిగతా 6 లో...

- 'ప్రజాజ్యోతి' ఇన్వెస్టిగేటివ్ కథనాల ప్రభంజనం..
- ప్రజాధనాన్ని, ప్రభుత్వ భూములను రక్షించిన వేళ వెల్లువెత్తుతున్న ప్రశంసలు!
- జిల్లా కలెక్టర్ సీరియస్.. సమగ్ర నివేదికలు సమర్పించిన పారిశ్రామిక, వ్యవసాయ, విద్యుత్, పీసీబీ శాఖలు!
- వ్యవసాయ శాఖ షోకాజ్.. రూట్‌వెల్ లైసెన్సుల రద్దుకు రంగం సిద్ధం!
- రూట్‌వెల్‌కు కరెంట్ కనెక్షనే లేదు.. ఉన్న పాత మీటర్ తొలగింపునకు విద్యుత్ శాఖ కసరత్తు!
- రూ. 3.75 కోట్ల బ్యాంక్ లోన్ రికవరీపై పెద్ద ప్రశ్నార్థకం..
- 420 కేసుతో మిషనరీ స్వాధీనానికి పోలీసుల చర్యలు!




## చర్యలకు సన్నాహాలు.. కిన్నెర రూట్‌వెల్‌పై ఉచ్చు బిగింపు!

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 28, ప్రజాజ్యోతి :** కొత్తగూడెం పారిశ్రామిక వాడలోని ప్లాట్ నంబర్ 17 (11,173 గజాల ) 'కిన్నెర–రూట్ వెల్' భూ అక్రమాలపై 'ప్రజాజ్యోతి' ప్రచురించిన వరుస సంచలనాత్మక ఇన్వెస్టిగేటివ్ కథనాలు చివరకు అధికార యంత్రాంగంలో అసాధారణ చలనం తెచ్చాయి. రూ. 17 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి, 3 కోట్ల ఈ ఓ టి పెనాల్టీ ఎగనామం తాలుకు అంశాలు బినామీల చేతుల్లోకి వెళ్లిన వైనాన్ని, చట్టబద్ధత లేని రూ. 100 బాండ్ పేపర్‌తో కోట్ల రూపాయల బ్యాంక్ లోన్ దందాను నిరంభయంగా వెలికితీసిన 'ప్రజాజ్యోతి' కథనాలపై జిల్లావ్యాప్తంగా ప్రజాసంఘాలు, పారిశ్రామిక వర్గాలు, సామాన్య ప్రజల నుంచి తీవ్ర ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. 'ప్రజాజ్యోతి' కథనాలతో

మిగతా 6 లో...




## రాజకీయ పరిహాసానికి...

# సింగరేణి సరెండర్

- గతంలో ఐఎన్టియుసి నేత జనక్ ప్రసాద్ 'కుర్చీ' వివాదం..
- నేడు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ 'క్యాంప్' హుకుం!
- సింగరేణి అధికారిక వేదికలపై రాజకీయ అనుబంధ సంఘాల పెత్తనం!
- సిఎండి సీట్లోనే కూర్చుని సమీక్షలు నడిపిన ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్!
- కలెక్టరేట్, సచివాలయం పక్కనబెట్టి సొంత క్యాంప్ ఆఫీస్‌లోనే సమీక్షల నాటకం!
- మైన్స్ యాక్ట్, చట్టబద్ధ ప్రొటోకాల్‌ను బజారున పడేసిన డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ, జీఎం లలిత్ కుమార్!
- సింగరేణి వ్యాప్తంగా నిరసన జ్వాలలు.. లొంగిపోయిన అధికారులపై తక్షణ చర్యలకు డిమాండ్!

**రాష్ట్రానికి వెలుగులు పంచే దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పట్ల రాజకీయ వ్యవస్థ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర పరిహాసానికి దారితీస్తోంది. ప్రజాస్వామ్య సరిహద్దులను దాటి అధికార పార్టీ నాయకులు ప్రదర్శిస్తున్న ఆధిపత్యం, దానికి ఉన్నతాధికారులు మోకరిల్లుతున్న వైఖరి పాలనాపరమైన దిగజారుడుతనానికి పరాకాష్టగా నిలుస్తోంది. గతంలో కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నేరుగా హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ సమీక్ష మందిరంలో కంపెనీ సిఎండి కూర్చునే అధికారిక కుర్చీలోనే ఆసీనులై ఏకంగా యూనియన్ సమావేశాన్ని నిర్వహించడం అప్పట్లో పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే.**

● భద్రాద్రి కొత్తగూడెం / సింగరేణి ప్రతినిధి, ప్రజాజ్యోతి

ఆ ఘటన మరవకముందే, తాజాగా గురువారం నాడు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తన సొంత క్యాంప్ కార్యాలయానికి సింగరేణి ఉన్నతాధికారులను పిలిపించుకుని నిర్వహించిన సమావేశం, సదరు అధికారుల లొంగుబాటు ధోరణి ఇప్పుడు నల్లబంగారు సామ్రాజ్యంలో పెద్ద రాజకీయ పరిహాసంగా మారింది.

### సిఎండి కుర్చీ నుండి క్యాంప్ ఆఫీస్ వరకు..

సింగరేణి ఆస్తులను, అధికారిక వేదికలను రాజకీయ అవసరాలకు వాడేసుకోవడం పరిపాటిగా మారిందనడానికి గతంలో జనక్ ప్రసాద్ ఉదంతమే ప్రత్యక్ష సాక్ష్యం. ఏకంగా సిఎండి స్థానంలో కూర్చుని యూనియన్ సమీక్షలు నడిపిన రోజునే సంస్థ ఆత్మగౌరవం తీవ్రంగా దెబ్బతింది. ఇక అదే రాజకీయ చొరబాటును కొనసాగిస్తూ, ఇప్పుడు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తన ప్రాభవాన్ని ప్రదర్శిస్తూ సింగరేణిని సొంత పరిధిగా మార్చుకునే ప్రయత్నం చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కలెక్టరేట్, సచివాలయం లేదా సింగరేణి అధికారిక ప్రాంగణాల వంటి తటస్థ వేదికలను పక్కనపెట్టి, సొంత ప్రాంగణంలోనే అధికారులను కూర్చోబెట్టుకుని ప్రదర్శించిన ఈ 'రాజకీయ దర్పం' ప్రభుత్వ రంగ సంస్థల స్వతంత్రతను వెక్కిరించేలా ఉంది.

### డైరెక్టర్, జీఎం అధికారుల ఆత్మసమర్పణ!

ఇక ఎమ్మెల్యే పిలుపునకు తలొగ్గి, తమ చట్టబద్ధమైన హోదాను తాకట్టు పెట్టిన డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ ల వైఖరి మరింత పరిహాసస్పదంగా మారింది. వేల కోట్ల బడ్జెట్, వేలాది మంది కార్మికుల జీవితాలు, ఉత్పత్తి లక్ష్యాలను పర్యవేక్షించే కంపెనీ బోర్డు సభ్యుడైన డైరెక్టర్ స్థాయి అధికారి ప్రొటోకాల్‌ను, మైన్స్ యాక్ట్ నిబంధనావళిని నడిబొడ్డున పక్కన పెట్టి రాజకీయ నాయకుడి ముంగిట తలవంచడం క్షమించరాని పరిణామం. దీంతో చట్టబద్ధమైన అధికారాలు కలిగిన అధికారులే తమ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి మోకరిల్లితే, ఇక సంస్థాగత స్వయంప్రతిపత్తికి, ప్రొటోకాల్ ప్రమాణాలకు అర్థమేముంటుందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

### రాజకీయ క్రీడలో చట్టబద్ధ ప్రొటోకాల్ బలి!

సింగరేణి భవన్‌లో జనక్ ప్రసాద్ సిఎండి కుర్చీలో కూర్చుని నడిపిన రాజకీయం మొదలుకుని, గురువారం నాడు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన పరిణామం వరకు అన్నీ సంస్థ స్వయంప్రతిపత్తిని తీవ్రంగా దెబ్బతీశాయి. ప్రొటోకాల్‌ను కాలరాస్తూ అధికారులు పొలిటికల్ లీడర్ల ముంగిట లొంగిపోవడంపై నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ పెత్తనం ముందు అధికారులు తమ హోదాను విస్మరిస్తే, రేపు గనుల్లో భద్రతా ప్రమాణాలు, కార్మికుల ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదముంది. ఈ మొత్తం వ్యవహారంపై అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని, ప్రొటోకాల్‌ను బజారున పడేసిన బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు బలంగా డిమాండ్ చేస్తున్నాయి. అసలు గురువారం నాడు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఏం జరిగింది? ఉన్నతాధికారుల నుంచి ఏ అంశాలపై హామీలు పొందారు? సంస్థ నియమావళిని పక్కనబెట్టి సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఏం వచ్చింది? అనే విషయాలపై యాజమాన్యం వెంటనే స్పష్టమైన ప్రకటన విడుదల చేసి పారదర్శకతను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవేళ ఈ దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థ ఆత్మగౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం విఫలమైతే, సింగరేణి స్వయంప్రతిపత్తి పరిరక్షణ కోసం కార్మిక వర్గాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు.

### వెల్లువెత్తుతున్న నిరసన జ్వాలలు!

ఈ అప్రజాస్వామ్య, లొంగుబాటు ఘట్టంపై సింగరేణి వ్యాప్తంగా కార్మిక వర్గాలు, ప్రతిపక్షాలు, విశ్రాంత ఉద్యోగుల నుంచి తీవ్ర నిరసన జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. సంస్థ ఆత్మగౌరవాన్ని, చట్టబద్ధ ప్రొటోకాల్‌ను బూట్ల కింద తొక్కిపట్టేశారంటూ కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయ నాయకుల పెత్తనానికి లొంగిపోయి సంస్థ గౌరవాన్ని బజారున పడేసిన డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ, జీఎం లలిత్ కుమార్‌లను తక్షణమే ఆయా బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంతటి రాజ్యాంగ ఉల్లంఘనకు, వ్యవస్థల పరిహాసానికి పాల్పడ్డ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పదవిని కూడా రద్దు చేసి తక్షణమే ఆయనను శాసనసభ నుండి బర్తరఫ్ చేయాలని స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రజాప్రతినిధుల రాజకీయ పరిహాసాన్ని, అధికారుల ఆత్మసమర్పణ ధోరణిని అరికట్టకపోతే దిగ్గజ సంస్థ తన స్వతంత్రతను శాశ్వతంగా కోల్పోక తప్పదని హెచ్చరిస్తూ ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

# నేడు-రేపు కిన్నెరసాని గిరిజన క్రీడల పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 29, (ప్రజా జ్యోతి)**

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి రాహుల్ ఆదేశాల మేరకు ఐటిడిఏ పరిధిలోని ఉపాధ్యాయ ఉద్యోగులకు జిల్లాస్థాయిలో క్రీడా పోటీలు ఈనెల 29, 30 తేదీలలో పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని గ్రామంలో గల గిరిజన క్రీడల పాఠశాలలో ఉపాధ్యాయ, ఉద్యోగ జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించినట్లు ఐటీడీఏ క్రీడల అధికారి బి గోపాలరావు శుక్రవారం తెలిపారు, ఆయన మాట్లాడుతూ ఈ క్రీడలు మూడు విభాగాలుగా నిర్వహించడం జరుగుతుందన్నారు, మొదటగా ఐటిడిఏ పరిధిలో ఉన్న డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ఇంటర్ స్కూల్ కాంప్లెక్స్ వారీగా ఉన్న



స్కూల్ కాం ప్లెక్స్ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు క్రీడలు నిర్వహించి ఆ తర్వాత డివిజన్ పరిధిలో ఉండే స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలలన్నిటిని డివిజన్ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు, ఈ క్రీడలు డివిజన్ స్థాయిలో ఐటీడీఏ పరిధిలో ఉన్నట్టవంటి 5 డివిజన్లలోనే భద్రాచలం, ఇల్లందు, దమ్మపేట, ఖ మ్మం, వైరా,లో క్రీడలు నిర్వహించడం జరిగిందని ,ఆ విధంగా ఐటిడిఏ పరిధిలో ఉన్నటువంటి భద్రాచలం దమ్మపేట ఇల్లందు, వైరా, ఖమ్మం డివిజన్లో క్రీడలను నిర్వహించి అక్కడ గెలుపొందినటువంటి ఉద్యోగ ఉపాధ్యాయులందరూ జిల్లా స్థాయిలో పాల్గొనే విధంగా జట్లు క్రీడా జట్లను తయారు చేయడం జరిగింద నీ వివిధ డివిజన్లో క్రీడల్లోపాల్గొనీ ఎంపిక కాబడినటువంటిఉద్యోగ ఉపాధ్యాయ క్రీడాకారులందరూ ఈ నెల 29 ,30 తేదీలలో క్రీడల పాఠశాల కిన్నెరసాని నందు నిర్వహించే జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొంటారని, జిల్ లాస్థాయిలో వివిధ క్రీడాంశాల్లో క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ పోటీలలో వాలీబాల్ ,క్రికె ట్,చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, 60 మీటర్ రన్, షార్ట్ పుట్, టెన్ని కా యట్, క్రీడల్లో పురుష మహిళ ఉద్యోగ ఉపాధ్యాయ ఉపాధ్యాయులకు క్రీడలు నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు, ఈ క్రీడా పోటీలను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి పిఓ బి రాహుల్ ,గిరిజన సంక్షేమ శాఖ అధికారి చందన లు పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు, ఐదు డివిజన్ల ఏ టి డి వోలు పర్యవేక్షణలో ,ఐదు డివిజన్లో ఉ న్నటువంటి అసిస్టెంట్ స్పోర్ట్స్ అధికారుల యొక్క పర్యవేక్షణలో ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# కరాటేలో గిన్నిస్ రికార్డు సాధించిన రాంబాబుకు ఘన సన్మానం



**పినపాక,ఆగష్టు 28(ప్రజాజ్యోతి)** పినపాక మండలం దుగినేపల్లి గ్రామానికి చెందిన చర్ప రాంబాబు కరాటేలో ప్రతిభ చాటి గిన్నిస్ రికార్డులో స్థానం సంపాదించారు. గ్రామానికి చెందిన యువకుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల దుగినేపల్లి గ్రామస్థులు, యువత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుగినేపల్లి యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాంబాబును ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కరాటేలో రాంబాబు సాధించిన విజయాన్ని ఆదర్శంగా తీసుకుని యువత క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని పలువురు ఆకాంక్షించారు.గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చినందుకు రాంబాబుపై ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో పూజారి రాజేష్, మలోత్ భాస్కర్, భూపతి నాగేశ్వర రావు, శాతంశెట్టి సంతోష్, సున్నం సుదర్శన్, ఎల్పీ రాంప్రసాద్, బానోత్ సంతోష్, ఎంపల్లి స్వస్తిక్ తదితరులు పాల్గొని రాంబాబును అభినందించారు.

# రాఖీ పౌర్ణమి వేడుకలు









**ఇల్లందు, ఆగస్ట్ 28 (ప్రజా జ్యోతి)** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం వేడుకలు ఘనంగా జరిగాయి. టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు తోబుట్టువులు, మహిళలు, చిన్నారులు రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ కు మహిళలు, చిన్నారులు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ వారి సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ జానీ పాషా కు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్షి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలతో పాటు ఇల్లందు పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# దండు సారయ్య స్వగృహంలో రాఖీ పౌర్ణమి వేడుకలు

- రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్న తోబుట్టువులు, తోటి కౌన్సిలర్, ఆ ప్రాంత మహిళలు







**ఇల్లందు, ఆగస్ట్ 28 (ప్రజా జ్యోతి )**అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమానురాగాలు, ఆత్మీయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు ఇల్లందు పట్టణంలో ఘనంగా జరిగాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది. ఈ క్రమంలో శుక్రవారం 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య స్వగృహంలో రాఖీ పౌర్ణమి వేడుకలను కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ఆత్మీయంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం కలిగిన పండుగ అని దండు సారయ్య పేర్కొన్నారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలను మరింత బలపరిచే పవిత్రమైన రోజుగా రాఖీ పౌర్ణమిని జరుపుకుంటామన్నారు. రాఖీ కట్టడం ద్వారా సోదరుల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకోవడంతో పాటు, ఒకరికి ఒకరు అండగా నిలవాలనే భావనను వ్యక్తం చేస్తారని తెలిపారు. 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య తోబుట్టులతో పాటు 18వ వార్డు కౌన్సిలర్ పాబోలు స్వాతి మణి కిరణ్ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, కుటుంబ అనుబంధాలకు, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తూ రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేకంగా నిలిచింది. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య అన్నారు. రాఖీ పౌర్ణమి వంటి పండుగలు కుటుంబ సభ్యులను ఒకచోట చేర్చి ఆత్మీయతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు జీవితాంతం కొనసాగాలని ఆకాంక్షించారు.ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలిప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, కుటుంబ సభ్యులంతా పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కోరారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలను మరింత పెంచేలా సాగాయని తెలిపారు.

# ఆర్ కొత్తగూడెంలో వైద్య శిబిరం

- 55 మందికి వైద్య పరీక్షలు మందుల పంపిణీ



**చర్ల, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి):** చర్ల మండలం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆర్ కొత్తగూడెం గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సందీప్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామస్తులకు వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరంలో పాల్గొన్నవారికి ఎలాంటి జ్వర కేసులు లేవని వైద్య సిబ్బంది తెలిపారు. జలుబు, దగ్గు, దురద తదితర సాధారణ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులను అందజేశారు. మొత్తం 55 మందికి సాధారణ వ్యాధులకు మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామస్తులకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎల్లప్పుడూ శుభ్రమైన నీటిని వినియోగించాలని అవగాహన కల్పించారు. నీటిని కాచి చల్లార్చిన తర్వాత మాత్రమే తాగాలని, భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి పి. పార్వతి, హెచ్ వి కె. తిరుపతమ్మ, ఏఎన్ఎంఎన్. ముత్తమ్మ, ఆశా కార్యకర్త ఈశ్వరమ్మతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పుసుకుంట చెక్‌పోస్టు వద్ద ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**దమ్మపేట,ఆగస్టు.28 (ప్రజాజ్యోతి ):** పుసుకుంట చెక్‌పోస్టు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటవీశాఖ సిబ్బంది గురువారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇసుక లోడుతో వచ్చిన ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. ఇసుక రవాణాకు సంబంధించి చెల్లుబాటు అయ్యే అనుమతులు, పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను ఇసుక లోడుతో సహా స్వాధీనం చేసుకుని అటవీశాఖ ఆధీనంలో ఉంచారు. ఘటనపై సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.శ్రీను తెలిపారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అక్రమ రవాణాపై సమాచారం ఉంటే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు.



## తాటి వెంకటేశ్వర్లు ఇంట రాఖీ పండుగ సందడి



**దమ్మపేట, ఆగస్టు 28,(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలోని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు నివాసంలో రాఖీ పండుగ సందడి నెలకొంది. రక్షాబంధన్ సందర్భంగా ఆయన సోదరీమణులు తాటి వెంకటేశ్వర్లుకు రాఖీలు కట్టి ఆప్యాయతను చాటుకున్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ బంధానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలను మరింత బలోపేతం చేసే పండుగ రక్షాబంధన్ అని పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత




**బూర్గంపహాడ్, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. నాగినేనిప్రోలురెడ్డిపాలెం గొమ్మూరు వద్ద గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని కిలో రూ.17 చొప్పున కొనుగోలు చేసి, టాటా మ్యాజిక్ వాహనంలో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం మేరకు బూర్గంపహాడ్ ఎస్సై మేడా ప్రసాద్ తన సిబ్బందితో కలిసి గొమ్మూరు వద్ద వాహనాన్ని తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో టాటా మ్యాజిక్ వాహనంలో ఉన్న 10 బస్తాల (5 క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తున్న వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## వివాహ వేడుకకు హాజరైన మాజీ జెడ్పీటీసీ



**బూర్గంపహాడ్, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి ):** మధిర మండలం సిరిపురం గ్రామంలోని పీవీఆర్ అండ్ ఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కొనకంచి కుటుంబ వివాహ వేడుకకు బూర్గంపహాడ్ మండల మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత హాజరయ్యారు. సారపాక మాజీ టౌన్ అధ్యక్షుడు కొనకంచి శ్రీను అన్నయ్య కొనకంచి ప్రాన్సిస్–మరియమ్మ దంపతుల కుమారుడు ప్రశాంత్, ప్రసన్న వివాహం సందర్భంగా నూతన వధూవరులను ఆమె ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కొనకంచి శ్రీను మిత్రబృందం, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# విత్తన రాఖీతో పర్యావరణ పరిరక్షణ

- శ్రీ సరస్వతి విద్యానికేతన్ లో రక్షాబంధన్ వేడుకలు
- విద్యార్థులకు గుడ్ టచ్- బాడ్ టచ్ పై అవగాహన కార్యక్రమం







**చర్ల, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి ):** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తేగడలోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు వినూత్నంగా పలు సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. పండుగలో భాగంగా గురువారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు 'విత్తన రాఖీ' తయారీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ రాఖీలకు బదులుగా విత్తనాలతో విద్యార్థులు స్వయంగా రాఖీలను తయారు చేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన చాటారు. రాఖీ కట్టిన అనంతరం కానుకగా అందించే కృతజ్ఞతా పత్రం, గౌరవ పత్రం తయారు చేసే విధానాన్ని కూడా విద్యార్థులకు వివరించారు. 'మగపిల్లల పెంపకంలో మార్పు తెద్దాం–సమాజంలో భద్రతను పెంచుదాం', 'ఆడపిల్లలతో పాటు అబ్బాయిల నడవడికపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి' వంటి నినాదాలతో విద్యార్థులతో కలిసి సామాజిక చైతన్య ర్యాలీ నిర్వహించారు. బాలికల భద్రతతో పాటు బాలుర ప్రవర్తనలోనూ చిన్ననాటి నుంచే మార్పు తీసుకురావాల్సిన అవసరాన్ని ర్యాలీ ద్వారా తెలియజేశారు.ర్యాలీ అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు బాలల రక్షణపై గుడ్ టచ్ – బాడ్ టచ్ పై, ఆత్మ రక్షణ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు తమకు ఎదురయ్యే అసౌకర్యకర పరిస్థితులను గుర్తించడం, వాటిపై స్పందించడం, అవసరమైన సమయంలో పెద్దల సహాయం కోరడం వంటి అంశాలను వివరించారు.అనంతరం విద్యార్థులు చర్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రాత్రింబవళ్లు సమాజ రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు రాఖీలు కట్టి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు 'గౌరవ రక్షా పత్రం' అందజేశారు. రాజకీయ సిఫార్సులు, ఒత్తిళ్లకు లోబడకుండా ఆడపిల్లలకు న్యాయం చేయాలని, పోలీసులపై తమకు పూర్తి నమ్మకం ఉందని విద్యార్థులు ఆ పత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల మధ్య రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. విద్యార్థినులు స్వహస్తాలతో తయారు చేసిన విత్తన రాఖీలను సోదరులకు కట్టారు. రాఖీ కట్టించుకున్న విద్యార్థులు తమ సోదరీమణులకు కృతజ్ఞతా పత్రం, గౌరవ పత్రం కానుకగా అందించి ప్రతి ఆడపిల్లను గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ లిఖిత మాట్లాడుతూ విద్యార్థులను కేవలం మార్కులకే పరిమితం చేయకుండా, సమాజ బాధ్యత కలిగిన ఉత్తమ పౌరులుగా, దేశభక్తులుగా తీర్చిదిద్దడమే పాఠశాల సంకల్పమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, అరుణ, శ్రావణి, పూజ, ప్రమీల, శ్రీదేవి, శైలజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**పినపాక,ఆగస్టు 28(ప్రజాజ్యోతి )** అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ ను పినపాక మండల కేంద్రంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం నుం చే మండల కేంద్రంలోని మార్కెట్ ప్రాంతంలో సందడి నెలకొంది. మహిళలు, చి న్నారులు, యువతులు వివిధ రకాల రంగురంగుల రాఖీలను కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్దకు తరలివచ్చారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షించారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు కానుకలు అందజేసి, జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దీంతో పినపాక మండల కేంద్రంలోని ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది.రక్షాబంధన్ భారతీయ సంస్కృతిలో అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న పవిత్రమైన బంధానికి ప్రతీకగా నిలుస్తుందని పెద్ద లు పేర్కొన్నారు. కేవలం రాఖీ కట్టుకోవడమే కాకుండా కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు పెంపొందించుకోవడం, పరస్పరం కష్టసుఖాల్లో తోడుగా నిలవడం ఈ పండుగ ప్రధాన సందేశమని తెలిపారు.పండుగ నేపథ్యంలో పినపాక మండల కేంద్రంలో రాఖీలు, స్వీట్లు, పండ్లు, బహుమతుల విక్రయాలు జోరు గా సాగాయి. చిన్నారులు, యువతులు తమకు నచ్చిన రాఖీలను ఎంపిక చేసుకోవడంతో దుకాణాలు సందడిగా కనిపించాయి. పలు కుటుంబాల్లో సోదరీమణులు దూర ప్రాంతాల్లో ఉన్న సోదరులకు రాఖీలు పంపించి తమ ఆప్యాయతను చాటుకున్నారు.





## మాల మహానాడు కొత్తగూడెం జిల్లా యూత్ అధ్యక్షుడిగా వాసు మల్ల గౌతమ నియామకం





**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 29 ,(ప్రజా జ్యోతి)** మాల మహానాడు కొత్తగూడెం జిల్లా యూత్ అధ్యక్షులుగా వాసుమల్ల గౌతమ్ నియమితులయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు పిల్లి సుధాకర్ తనను నియమించారని ,ఈ మేరకు నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు చేతుల మీదుగా తాను శుక్రవారం అందుకున్నట్లు తెలిపారు, జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ తో తాను 1350 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం జరిగిందన్నారు, మాల మహానాడు ఆధ్వర్యంలో తాను చేసిన సేవలు గుర్తించిన రాష్ట్ర అధ్యక్షులు తనకు ఈ పదవికి ఎంపిక చేసినట్లు తెలిపారు ,మాలల ఐక్యతకు అభివృద్ధికి పాటుపడతానని రా ష్ట్ర కమిటీ ఎటువంటి కార్యక్రమాలకు పిలుపునిచ్చిన తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు, తమపై నమ్మకం ఉంచి జిల్లా యూత్ అధ్యక్షులుగా తనను ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు మల్ల సుందర్రావు జిల్లా అధ్యక్షులు తోట మల్ల రమణమూర్తి, శనగ వెంకటేశ్వర్లు, గుర్రం వెంకట రత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్, ఏ డెల్లి గణపతి, పెంకి శ్రీనివాసరావు, వల్ల మల్ల వెంకటరత్నం, గడిదేసి ప్రభాకర్, శనగ రామ్ చందర్, హరీష్, కూరపాటి దాస్, శెట్టి కమలాకర్, నరసింహారావు, పాల్గొన్నారు.

# తెలంగాణ ఇసుక వద్దు.. ఆంధ్ర ఇసుక ముద్దు!

- సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక రవాణాపై పెరుగుతున్న చర్చ





**అశ్వరావుపేట: ప్రజా జ్యోతి ఆగస్ట్ 28** తెలంగాణ రాష్ట్రంలో ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ, సరిహద్దు ప్రాంతాల్లో కొందరు వినియోగదారులు, నిర్మాణదారులు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే ఇసుకకే మొగ్గు చూపుతున్నారనే చర్చ సాగుతోంది. తెలంగాణ ఇసుక నాణ్యత, ధర, లభ్యతపై అసంతృప్తి కారణంగానే ఆంధ్ర ఇసుకకు డిమాండ్ పెరుగుతోందా? లేక రవాణా, సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలే ఇందుకు కారణమా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**ధర ఒకటేనా? నాణ్యతలో తేడా ఉందా?**

స్థానికంగా లభించే ఇసుక ధరలు, ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చే ఇసుక ధరల మధ్య వ్యత్యాసం, ఇసుక నాణ్యత, రవాణా ఖర్చులు వంటి అంశాలు వినియోగదారుల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అయితే అసలు ధర ఎంత? ప్రభుత్వ నిర్దేశిత ధర ఎంత? రవాణా పేరుతో అదనంగా వసూలు చేస్తున్న మొత్తం ఎంత? అన్నది అధికార యంత్రాంగం స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**సరిహద్దు వద్ద పర్యవేక్షణ ఏది?**

అశ్వరావుపేట వంటి సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక రవాణాపై సంబంధిత అధికారులు నిరంతరం నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. అనుమతులు, రవాణా పత్రాలు, వాహనాల వివరాలు పరిశీలించకుండా ఇసుక తరలితే ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉంది.ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఇసుక నిర్మాణ రంగా నికి అవసరమైన ఇసుక సరసమైన ధరకు, నిబంధనల ప్రకారం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. స్థానికంగా ఇసుక లభ్యత పెంచడంతో పాటు ధరలపై పారదర్శకత తీసుకురావాలని అంటున్నారు.

**అధికారుల ముందున్న ప్రశ్నలు**

**తెలంగాణ ఇసుక ధర ఎంత? ఆంధ్ర ఇసుక ధర ఎంత?**
**రవాణా ఖర్చు పేరుతో ఎంత వసూలు చేస్తున్నారు?**
**సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక వాహనాల తనిఖీలు ఎలా జరుగుతున్నాయి?**
**అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**
**స్థానికంగా ఇసుక లభ్యత ఎందుకు సరిపోవడం లేదు?**
**వినియోగదారులు ఆంధ్ర ఇసుక వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నారు?**

నిబంధనలు పాటించాలి.. అక్రమ రవాణా ఆగాలి ఇసుక ఏ రాష్ట్రం నుంచి వచ్చినా ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణ అనుమతులు, రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ప్రజలకు ఇసుక కొరత లేకుండా, సరసమైన ధరకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## రాఖీ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు



**దమ్మపేట, ఆగస్టు 28(ప్రజాజ్యోతి):** రాఖీ పౌర్ణమి సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావును మహిళా నాయకురాళ్లు కలిసి రాఖీలు కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించి అశ్వారావుపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.రాఖీలు కట్టిన మహిళా నాయకురాళ్లకు మెచ్చా నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుక తమ మధ్య ఉన్న ఆత్మీయతకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.

## శ్రావణ పౌర్ణమికి పెద్దమ్మ తల్లి సన్నిధిలో ఆధ్యాత్మిక వైభవం

- ఘనంగా చండీ హోమం.. భక్తిశ్రద్ధలతో పూజలు
- 17 మంది దంపతులతో ప్రత్యేక హోమం.
- భక్తులకు అన్నప్రసాద వితరణ.
- పెద్దమ్మ తల్లికి వైభవంగా పంచామృతాభిషేకం

**పాల్వంచ, ఆగస్టు 28, ప్రజాజ్యోతి:** శ్రావణ పౌర్ణమి సందర్భంగా పాల్వంచ మండలం కేశవాపురం–జగన్నాధపురంలోని శ్రీ కనకదుర్గ (పెద్దమ్మ తల్లి) దేవస్థానం భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్. రజనీకుమారి ఆదేశాల మేరకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

మేళతాళాలు, వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి ఉత్సవ విగ్రహం....
ముందుగా మేళతాళాలు, వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి యాగశాలకు తీసుకువచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజలను నిర్వహించి చండీ హోమానికి శ్రీకారం చుట్టారు.వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హోమ కార్యక్రమాన్ని నిర్వహించి, చివరిగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

**17 మంది దంపతులతో చండీ హోమం ....** చండీ హోమంలో మొత్తం 17 మంది దంపతులు పాల్గొన్నారు. ఒక్కో దంపతులు రూ.2,516 రుసుము చెల్లించి హోమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.హోమం అనంతరం అర్చకులు, వేద పండితులు భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. హోమంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

**పెద్దమ్మ తల్లికి పంచామృతాభిషేకం ....** ఇదే సందర్భంగా శ్రీ పెద్దమ్మ తల్లికి పంచామృతాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా మేళతాళాల మధ్య దేవస్థాన అర్చకులు, భక్తులు జన్మస్థలం వద్ద ఉన్న అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి హారతి ఇచ్చారు.అనంతరం ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**భక్తులతో కళకళలాడిన పెద్దమ్మ తల్లి ఆలయం....** శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, చండీ హోమం భక్తులను ఆధ్యాత్మికంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనం, పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు భక్తులు ఉత్సాహంగా తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సిబ్బంది, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.



## రాఖీ పౌర్ణమి వేళ ఎమ్మెల్యే జారె మహిళల ఆత్మీయత



**దమ్మపేట, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి ):** రాఖీ పౌర్ణమి సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు మహిళలు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ..ఒక పురుషుడి జీవితం ఉన్నత స్థాయికి చేరడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. జన్మనిచ్చి మంచి విలువలను నేర్పిన తల్లి, చిన్ననాటి నుంచి ఆప్యాయత, అనురాగాలను పంచిన సోదరి, జీవిత ప్రయాణంలో ప్రతి కష్టంలోనూ తోడుగా నిలిచే జీవిత భాగస్వామి అందించే ప్రేమ, ప్రోత్సాహం మరువలేనిదన్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా తన జీవితంలో ఆత్మీయతను పంచుతున్న మహిళలందరికీ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. తన జీవితంలో ప్రతి అడుగులోనూ స్ఫూర్తినిస్తున్న కుటుంబ సభ్యులు, మహిళలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన రాఖీ వేడుకల్లో మహిళలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన కుంజా కవిత





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 28, ప్రజాజ్యోతి:** రక్షాబంధన్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే కుంజా భిక్షం కుమార్తె కుంజా కవిత హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. సీఎంకు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కుంజా కవిత ముఖ్యమంత్రిని కలుసుకోవడం, రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన డం ప్రాధాన్యత సంతరించుకుంది. రాఖీ కట్టిన అనంతరం రేవంతర◌డ్డితో కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడా రు. ఈ సందర్భంగా కుటుంబ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రిని కలవడం సంతోషంగా ఉందని కవిత పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కుంజా భిక్షం కుమార్తెగా రాజకీయ నేపథ్యం కలిగిన కుంజా కవిత ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో నాయకురాలిగా కొనసాగుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన మహిళగా కుంజా కవిత ప్రత్యేకతను చాటుకున్నారు.

## భద్రాచలంలో ఫుడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆకస్మిక తనిఖీ

- 30 కిలోల సరుకును ధ్వంసం చేసిన అధికారులు

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 28,(ప్రజా జ్యోతి)**

భద్రాచలం మార్కెట్లో ఫుడ్ ఇన్స్పెక్టర్ శరత్ ఆధ్వర్యంలో శుక్రవారం మార్కెట్లో నీ పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు . పలు దుకాణాలలో నాణ్యత లోపించిన సుమారు 30 కిలోల ఆహార పదార్థాలను గుర్తించి ధ్వంసం చేశారు, అనుమానిత ఆహార నమోనాలను పరీక్షల కోసం ల్యాబ్ కు తరలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తప్పనిసరిగా ఎఫ్ ఎస్ ఎఐ లైసెన్స్ పొంది ఉండాలని సూచించారు, నాణ్యత ప్రమాణాలు పాటించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ప్రజలకు ఎప్పటికప్పుడు నాణ్యమైన సరుకులను విక్రయించాలన్నారు.

## మీడియా ప్రతినిధులమంటూ ట్రాక్టర్ డ్రైవర్‌పై బెదిరింపు

(మొదటి పేజీ తరువాయి...)



ఎక్స్ రోడ్డు సమీపంలో పొగాకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను నిందితులు అడ్డగించారు. అనంతరం తాము మీడియా ప్రతినిధులమని పరిచయం చేసుకుని, ట్రాక్టర్ డ్రైవర్‌ను బెదిరించారు. ట్రాక్టర్‌లో పొగాకు తరలింపుపై ప్రశ్నలు సంధిస్తూ, తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భయాందోళనకు గురైన డ్రైవర్ నుంచి రూ.5 వేల నగదును లాక్కున్నట్లు సమాచారం.

**డబ్బులు లాక్కనే సమయంలో తోపులాట**

నిందితులు నగదు తీసుకుని అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించగా డ్రైవర్ వారిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

**మీడియా పేరుతో బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు**

నిందితులు మీడియా ప్రతినిధులమని చెప్పి రైతులు, వాహనదారులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**పోలీసుల దర్యాప్తు ముమ్మరం**

అరెస్టయిన ఇద్దరిని విచారిస్తున్న పోలీసులు, గతంలోనూ ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల నుంచి నగదు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

**రైతులు అప్రమత్తంగా ఉండాలి**

మీడియా ప్రతినిధులమని చెప్పి ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను నమోదు చేసుకుని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు.

**మీడియా పేరుతో బెదిరింపులు... ఇద్దరి అరెస్ట్**

రైతు నుంచి రూ.5 వేల నగదు లాక్కున్న నిందితులు రైతు కొలిక పోగు నరేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు




(మొదటి పేజీ తరువాయి...)

శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు బాలికలతో కాసేపు ఆప్యాయంగా ఆప్యాయంగా మాట్లాడి వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, అభిరుచుల గురించి తెలుసుకున్నారు. బాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ తదితర బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి, దేశానికి విలువైన సంపద అని అన్నారు. ప్రతి బాలికకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, నాణ్యమైన విద్యను అందించి, వారు తమ కలలను సాకారం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

"బేటీ బచావో – బేటీ పడావో" స్ఫూర్తితో బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి, ఉన్నత విద్యను అభ్యసించి, తమకు నచ్చిన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

"బాలికను కాపాడుదాం – బాలికను చదివిద్దాం – బాలిక ఎదుగుదలకు తోడ్పడదాం" అనే సందేశంతో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికల భద్రత, విద్య, భవిష్యత్తు కోసం బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రక్షాబంధన్ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు అధికారులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరి నుంచి తమకు అండగా ఉంటుందనే భరోసాను పొందారు. ఈ కార్యక్రమం లో హబ్ మిషన్ కోఆర్డినేటర్ సంతోష రూప , స్వాతి , ప్రియాంక , మౌనిక , దీప్తి , చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్ , బాలికలు పాల్గొన్నారు

# గట్టాయిగూడెంలో సెల్ టవర్ నిర్మాణ పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్

- నిర్మాణ పనులను అడ్డుకున్న స్థానికులు
- కాంట్రాక్టర్- ప్రజల మధ్య వాగ్వాదం
- ప్రజలు ఆగ్రహించడంతో వెనుజరిగిన కాంట్రాక్టర్





**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 29, (ప్రజాజ్యోతి)**

పాల్వంచ పట్టణంలోని గట్టాయిగూడెంలో శుక్రవారం సెల్ టవర్ నిర్మాణ పనులను స్థానికులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఓ ఇంట్లో సెల్ టవర్ ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులను స్థానికులు అడ్డుకున్నారు. జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం చేపట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. జన నివాస ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటు చేయవద్దంటూ వారు పనులను అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలో సెల్ టవర్ కాంట్రాక్టర్, స్థానికుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసుల జోక్యంతో సెల్ టవర్ కాంట్రాక్టర్, కార్మికులు అక్కడి నుంచి వెనుదిరిగారు.ఈ సంఘటన స్థలంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కిలారు నాగేశ్వరావు తో పాటు పలువురు మాట్లాడుతూ ఇక్కడ చేపడుతున్న సెల్ టవర్ నిర్మాణ పనులు గత ఆరు నెలల క్రితమే పనులను ప్రారంభించగా అట్టి పనులను అడ్డుకొని ఆనాడే పనులను చేపట్టరాదని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు, అయితే సదరు సెల్ టవర్ నిర్మాణ కాంట్రాక్టర్, యాజమాన్యం వారు కోర్టు నుండి నిర్మాణ పనులకు సంబంధించి ఎరాస్ ఆర్డర్ తీసుకొచ్చి నేడు సెల్ టవర్ నిర్మాణం పనులను తిరిగి మళ్ళీ ప్రారంభిస్తుండగా గట్టాయిగూడెం ప్రజలు జనవాసాల మధ్య సెల్ టవర్ పనులు నిర్మించరాదని అడ్డుకున్నారన్నారు, వాస్తవంగా కోర్టు ఆర్డర్ ప్రకారం సెల్ టవర్ నిర్మాణ పనులను ఇంటి పైన నిర్మించాల్సి ఉండగా సదరు కాంట్రాక్టర్ దానికి విరుద్ధంగా గ్రౌండ్ ఫ్లోర్లో నిర్మాణ పనులు ప్రారంభించగా కాంట్రాక్టర్ను ఇదేమిటని ప్రశ్నించగా సదరు కాంట్రాక్టర్ గట్టాయిగూడెం స్థానికులపై దుర్భాషలాడుతూ విచక్షణ రహితంగా ప్రవర్తించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగిందన్నారు, కోర్టు ఆర్డర్ ను తాము ధిక్కరించమని కోర్టు సూచనల మేరకు సెల్ టవర్ ను ఇంటి పైన నిర్మించాల్సి ఉందన్నారు, ఈ ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణం వల్ల రేడియేషన్ తో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు, కావున పూర్తిగా ఈ ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపి వేసే విధంగా తిరిగి మళ్లీ కార్పొరేషన్ కమీషనర్ ,కు స్థానిక శాసన సభ్యులకు తెలియజేస్తామన్నారు , టవర్ నిర్మాణ పనుల గురించి జరుగుతున్న వివాదం విషయాన్ని పోలీసులకు తెలియజేయగా స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోవడంతో వాగ్వాదం సద్దుమణిగింది, దీంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులను ఆపేసి వెనిదిరిగి వెళ్లారు.

# చర్యలకు సన్నాహాలు..

# కిన్నెర – రూట్‌వెల్‌పై ఉచ్చు బిగింపు!

(మొదటి పేజీ తరువాయి...)

హెచ్చరించిన యంత్రాంగం, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తక్షణమే రంగంలోకి దిగి నివేదికలు సిద్ధం చేస్తూ, అక్రమార్కులపై చట్టపరమైన ఉచ్చు బిగిస్తోంది.

**శాఖల సమాధానాలు.. చర్యల అంశాలు!**

>> జిల్లా పరిశ్రమల శాఖ : ప్లాట్ నంబర్ 17 వ్యవహారంపై కలెక్టర్‌కు సమగ్ర నివేదిక సమర్పించామని, తదుపరి కేటాయింపు రద్దు చర్యల కోసం దానిని టీజీఐఐసీ ఉన్నతాధికారులకు కూడా పంపినట్లు జిల్లా పరిశ్రమల అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

>> వ్యవసాయ శాఖ: రూట్‌వెల్ సంస్థకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశామని, క్షేత్రస్థాయి నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా తేలడంతో సంస్థ లైసెన్సులను రద్దు చేసేందుకు చర్యలు వేగవంతం చేశామని జిల్లా అధికారి బాబురావు వెల్లడించారు.

>> విద్యుత్ శాఖ: రూట్‌వెల్ పేరుతో అసలు ఎలాంటి కనెక్షన్ ఇవ్వలేదని సూపరింటెండెంట్ ఇంజనీర్ స్పష్టం చేశారు. పాత కిన్నెర మార్బుల్స్ మీటర్‌పై దొంగతనంగా కార్యకలాపాలు సాగిస్తున్నందున, కనెక్షన్‌ను శాశ్వతంగా తొలగిస్తున్నామన్నారు.

>> కాలుష్య నియంత్రణ మండలి : రూట్‌వెల్ సంస్థకు ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ధ్రువీకరించారు.

**కేటాయింపు రద్దు చేసి.. భూమిని స్వాధీనం చేసుకోవాలి!**

'ప్రజాజ్యోతి' కథనాలతో వ్యవస్థల్లోని నిద్రమత్తు వదిలి, అన్ని శాఖలు చర్యలకు సిద్ధపడటం పట్ల జిల్లా ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోంది. అయితే అధికారుల చర్యలు కేవలం నివేదికలు, నోటీసులకే పరిమితం కాకుండా నిబంధనలు ఉల్లంఘించిన ప్లాట్ నంబర్ 17 కేటాయింపును తక్షణమే రద్దు చేసి, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, తప్పుడు పత్రాలతో బ్యాంక్‌ను ముంచిన బినామీ సూత్రధారులను జైలుకు పంపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ రూట్ వెల్ అక్రమాల పుణ్యామా అని ఇకనైనా టీఎస్ఐఐసి అధికారులు తమ నిద్రమత్తు వదిలి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పారిశ్రామిక వాడలలో కేటాయించిన భూముల ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. అసలు ఇక్కడ కేటాయించిన లక్ష్యానికి విరుద్ధంగా ఏ ఏ ప్లాట్లలో ఏ ఏ సంస్థలు నడుస్తున్నాయి, వాటి వెనుక ఉన్న అనుమతులు, లీజుల బదిలీలు ఎంతవరకు చట్టబద్ధంగా ఉన్నాయనే అంశాలపై జిల్లా వ్యాప్తంగా సమగ్ర పరిశీలన జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన ప్రతీ ప్లాట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### రూ. 3.75 కోట్ల బ్యాంక్ లోన్ రికవరీ ఎలా?.. రూట్‌వెల్‌కు బ్యాంకర్ల షాక్!

ఇక సేల్ డీడ్, టీజీఐఐసీ అనుమతులు లేని అక్రమ ప్రాంగణం ఆధారంగా మంజూరైన రూ. 3.75 కోట్ల బ్యాంకు రుణం రికవరీ ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ నిబంధనల ఉల్లంఘన కింద టీజీఐఐసీ ఈ స్థలాన్ని రద్దు చేసి, ప్రభుత్వం భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటే.. బ్యాంకర్లకు ఈ కోట్ల రూపాయల ప్రజాధనం తిరిగి ఎలా వస్తుందనేది మిస్టరీగా మారింది. చట్టబద్ధమైన టైటిల్ లేని ఆస్తిని ఈక్యూ (ఇక్యుటేబుల్ అఫ్ మార్టిగేజ్ ) చేసి లోన్ ఇచ్చిన సదరు బ్యాంక్ అధికారులు, ఇప్పుడు లీగల్ చిక్కుల్లో పడటమే కాకుండా అక్రమార్కుల నుంచి ఆ రికవరీ ఎలా చేయాలో తెలియక తీవ్ర గందరగోళంలో పడినట్లు తెలుస్తోంది.

### పోలీసుల దృష్టిలో 420 కేసు.. మిషనరీ స్వాధీనం!

రూట్‌వెల్ సంస్థపై ఇప్పటికే నమోదైన 420 (మోసం) కేసుపై పోలీసులు దర్యాప్తు తీవ్రతరం చేశారు. చుంచుపల్లి ఎస్ఐ, ఎస్‌హెచ్ఓ రవికుమార్ ఆధ్వర్యంలో విచారణ సాగుతుండగా, ప్రాంగణంలో ఉన్న ఇతరుల మిషనరీలు, పరికరాలను స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. వీటితో పాటు తప్పుడు పత్రాలు సృష్టించడం, బ్యాంకులను, ప్రభుత్వాన్ని మోసగించిన అంశాలు నిర్ధారణ అయితే బాధ్యులపై మరిన్ని క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు సమాచారం.